బాలరాముడి వెండి నాణేలు త్వరలో మార్కెట్లోకి!

న్యూఢిల్లీ: అయోధ్యలో కొలువు దీరిన బాలరాముడి చిత్రాలతో కూడిన వెండి నాణేలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ముంబై బులియన్ మార్కెట్ త్వరలో వీటిని విడుదల చేయనుంది. ఇవి ఆఫ్‌లైన్ తో పాటు ఆన్‌లైన్ లోనూ లభ్యం కానున్నాయి. అయితే దీనిపై బులియన్ మార్కెట్ వ్యాపారులు అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఇప్పటికే వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ బాలక్‌రామ్ చిత్రాలతో వెండి నాణేలను విక్రయిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలరాముడికి సంబంధించిన మూడు సావనీర్ నాణేలను సైతం ప్రభుత్వం విడుదల చేసింది.

కేజ్రీవాల్ పిటిషన్‌పై రేపు విచారణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: తన అరెస్టును సమర్థిస్తూ ఢిల్లీ హైకోర్టు ఈనెల 9న ఇచ్చిన ఉత్తర్వులను ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. దీనిపై ఏప్రిల్ 15న న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనున్నది. మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయటాన్ని హైకోర్టు సమర్థించింది. అతను పదే పదే ఈడీ పంపిన సమన్లను పట్టించుకోకపోవడంతో పాటు దర్యాప్తుకు సహకరించనందుకు ఈడీ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. 15వ తేదీ వరకు ఆయనకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

జాఫర్ విదేశాలకూ డ్రగ్స్ సరఫరా చేసేవాడు: ఈడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: తమిళ సినీ నిర్మాత, డీఎంకే మాజీ నేత జాఫర్ సిద్ధిఖీ భారత్‌లో మాత్రమే కాకుండా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలకు కూడా మాదకద్రవ్యాలు సరఫరా చేసేవాడని ఈడీ గుర్తించింది. ఆయన రూ.70 కోట్లకు పైగా మనీలాండరింగ్‌కు పాల్పడ్డాడని, దీనికి సంబంధించిన ఆధారాలు సేకరించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 9న పీఎంఎల్‌ఏ చట్టం కింద చెన్నై, మధురై, తిరుచ్చిరాపల్లిలో జాఫర్, ఇతరులకు చెందిన ప్రాంగణాల్లో ఈడీ చెన్నై యూనిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. అంతర్జాతీయ డ్రగ్ అక్రమ రవాణాలో సిద్ధిఖీ ప్రధాన సూత్రధారిగా ఉన్నాడని ఈడీ భావిస్తున్నది.

చేవెళ్ల బహిరంగ సభలో ప్రజలకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బీజేపీకి నూకలు బుక్కిద్దాం

మతపిచ్చి లేపటం తప్ప చేసిందేం లేదు • మోడీ తప్పితే ఈడీ ఇదే ఆ పార్టీ విధానం: కేసీఆర్

- మెడికల్ కాలేజీ కోసం వంద లేఖలు రాసినం
- ఒక్క కాలేజీ ఇయ్యలె.. ఒక్క ఓటూ వేయొద్దు
- నా మెడమీద కత్తిపెటినా మీటర్లు పెట్టలె
- రైతాంగమే ముఖ్యమని తేల్చి చెప్పిన
- వడ్లు కొనుమంటే నూకలు తినుమన్నరు
- ఇలాంటి పార్టీని నేలకేసి గుద్దాలి
- చేవెళ్ల సభలో ప్రజలకు కేసీఆర్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): వడ్లు కొనాలని కోరితే తెలంగాణ ప్రజలనే నూకలు బుక్కాలన్న బీజేపీకి నూకలు బుక్కిపిద్దామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సభలో ఆయన మాట్లాడుతూ.. 'బీజేపీ పదేండ్ల నుంచి అధికారంలో ఉన్నది. ప్రజలకు, చేవెళ్ల యువత, మహిళలకు, అందరికీ దండం పెట్టి చెప్తున్నా. భావోద్వేగాలు పెంచటం, మతపిచ్చి లేపటం తప్ప.. బీజేపీ హాయంలో ఏదైనా ఒక మంచిపని జరిగిందా? పెట్రోల్ ధర ఎంత? డీజిల్ ధర ఎంత? ప్రజలు ఆలోచన చేయాలి. గుడ్డిగా ఓటు వేయొద్దు. చాలా మోసం జరుగుతుంది. ఈ బీజేపీ పదేండ్లలో దేశంలో 157 మెడిల్ కాలేజీలు మంజూరు చేసింది. వాటిల్లో తెలంగాణకు ఒక్కటైనా ఇవ్వాలని వంద ఉత్తరాలు రాసినా. ఒక్కటీ ఇవ్వలేదు. ఒక్క కాలేజీ ఇవ్వని బీజేపికి ఒక్క ఓటు కూడా ఎందుకు వేయాలి? చట్టప్రకారం దేశంలో ఎన్ని జిల్లాలుంటే జిల్లాకొక నవోదయ పాఠశాల పెట్టాలె. మన కొత్త జిల్లాలకు 23 కొత్త నవోదయ పాఠశాలలు రావాలె. అవి వస్తే.. బీసీలు, ఎస్సీలు, ఎస్టీల పిల్లలకు, అందరికీ దాంట్లో అవకాశాలు దొరుకుతాయి. నవోదయ పాఠశాలల కోసం వందకు పైగా ఉత్తరాలు రాసినా, 50 సార్లు స్వయంగా మోదీని అడిగినా ఒక్క నవోదయ పాఠశాల కూడా తెలంగాణకు ఇవ్వలేదు. చట్టాన్ని ఉల్లంఘించి, ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వని, ఒక్క నవోదయ పాఠశాల ఇవ్వని బీజేపీకి ఒక్క ఓటూ ఎందుకు వేయాలి?

బీజేపీని నేలకేసి గుద్దాలె

మోదీ నా మెడమీద కత్తిపెట్టి.. రైతుల మోటర్లకు మీటర్లు పెట్టకపోతే రాష్ట్రానికి వచ్చే నిధులు బంజేస్తా, సంవత్సరానికి రూ.5 వేల కోట్లు గుంజుకుంటా అని బెదిరించిండు. నా ప్రాణం పోయినా సరే.. నేను పెట్టనని చెప్పిన. అన్నట్టే మీటర్లు పెట్టలె. అందుకే ఆనాడు సంవత్సరానికి రూ.5 వేల కోట్లు కోసిండు మోదీ. రూ.30 వేల కోట్ల నష్టం రాష్ట్రానికి వచ్చింది. రైతుల బాధలు తెలుసు కాబట్టి.. కరెంటు వాళ్లకు అవసరం కాబట్టి.. రైతుల మీద భారం పడొద్దని ఆనాడు ఆ నిర్ణయం తీసుకున్నా. ఇయ్యాల బీజేపీ అభ్యర్థికి ఓటు వేస్తే ఏమైతది? మీటర్లు పెట్టుమని చెప్పంగ కూడా మాకే ఓటు వేసిండ్రు.. మాకే గుద్దిండ్రు.. పెట్టుర్రా! ఇగ మీటర్లు అంటరు. మీటర్లు రావాల్నా వద్దా? మీటర్లు రావొద్దంటే బీజేపీని నేలకేసి గుద్దాలె. అప్పుడే మనకు తెలివితేటలున్నట్టు. రాజకీయ పరిజ్ఞానం ఉన్నట్టు.

> ప్రస్తుతం దేశంలో ఏం జరుగుతున్నదంటే.. మా పార్టీలో జాయిన్ అయితవా? జైలుకు వెళ్తవా? అయితే.. మోడీ, తప్పితే ఈడీ. ఇదేనా బీజేపీ విధానం? ఇదేనా రాజకీయం? ఇదేనా దేశాన్ని ముందుకు తీసుకుపోయే పద్ధతి? ఇది ప్రజాస్వామ్యాన్ని ఎక్కడికక్కడ పాతరేసే పద్ధతి.
> - కేసీఆర్

నూకలు తినాలన్నోడిని ఏం చేద్దాం?

తెలంగాణలో రైతులు వ్యవసాయం బాగా చేసిండ్రు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కూడా వడ్లు బాగా పండినయ్. కాంటాలు పెట్టి ఎక్కడికక్కడే కొన్నాం. బ్యాంకుల్లో డబ్బులేసినం. మధ్య దళారి లేకుండా మద్దతు ధర ఇప్పించినం. ధాన్యం ఎక్కువ పండిందని, కేంద్రమంత్రిని వడ్లు కొనాలని అడిగితే.. యాసంగి వడ్లు నూకలు అవుతయన్నారు. పారా బాయిల్డ్ రైస్‌కు ఆర్డర్ ఇవాలని అడిగితే 'మీ ప్రజలకు నూకలు తినటం అలవాటు చేయండి. మీరు కూడా నూకలు తినుండ్రి' అన్నడు. తెలంగాణ ప్రజలు నూకలు తిన్నాట. మనల్ని నూకలు తినుమని చెప్పిన బీజేపీకి నూకలు బుక్కిపిద్దామా? ఓట్లు వేద్దామా? అనేది మీరే ఆలోచన చేయాలి. మన ఏడు మండలాలు తీసుకొని ఆంధ్రాకు అప్పగించింది బీజేపీ. ఏటా 300 మెగావాట్ల కరెంటు వచ్చే మన సీలేరు ప్రాజెక్టును బలవంతంగా గుంజి.. ఆంధ్రాకు అప్పగించింది. మన ఐటీఐఆర్‌ను క్యాన్సిల్ చేసింది. కాజీపేటలో రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ పెట్టనేలేదు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టుమంటే పెట్టలేదు. ఒక్క మెడికల్ కాలేజ్, ఒక్క నవోదయ స్కూలూ ఇవ్వలేదు' అని పేర్కొన్నారు.

> బిజేపీ వల్ల ఏ వర్గానికీ న్యాయం జరగలేదు. ఒక మత్తులో, ఒక మతంలో, ఒక పిచ్చిలో పడి ఓటేస్తే మనం కూడా పిచ్చిలేసిపోతాం తప్ప మన అవసరాలు తీరవు. ఉద్యోగాలు రావు. ఇవాళ దేశంలో 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఈ మొండి బిజేపీ ప్రభుత్వం వాటిని నింపటం లేదు. గుడ్డికన్ను మూసినా ఒకటే తెరిచినా ఒకటే అన్నట్టు బిజేపీకి ఓటు వేసినా, వేయకున్నా ఒకటే.
> - కేసీఆర్

అంబేద్కర్ ఆశయాలను నిజం చేశాం

- అంబేద్కర్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శాలు, కార్యాచరణ సంపూర్ణంగా అమలులోకి వచ్చిననాడే, దేశ స్వాతంత్ర్యానికి సంపూర్ణ ఫలితం దక్కినట్టని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలు, త్యాగాలను కేసీఆర్ స్మరించుకున్నారు. దళిత, బహుజన కులాలను అన్ని రంగాల్లో అగ్ర కులాలకు ధీటుగా తీర్చిదిద్దాలనే అంబేద్కర్ ఆశయాలను గడచిన తమ పదేండ్ల ప్రగతి పాలనలో నిజం చేసి చూపించామని కేసీఆర్ పేర్కొన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగంగా కొనసాగిందని పేర్కొన్నారు. రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్-3 ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిందని గుర్తుచేశారు. అందుకు కృతజ్ఞతగా తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంగా పేరు పెట్టుకున్నామని తెలిపారు.

ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ప్రారంభించిన నాటి దృశ్యం

కాంగ్రెస్‌పై భ్రమలు తొలగిపోయాయి

- వందరోజుల్లోనే ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత
- గారడీ మాటలు తప్ప.. చేతలు లేని సర్కారు ఇది
- నాగర్‌కర్నూలులో వందకు వందశాతం గెలుస్తున్నాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు చరిత్రలోనే అతి తక్కువ సమయంలో అత్యధిక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై వందరోజుల్లోనే ప్రజానీకానికి ఉన్న అన్ని భ్రమలు తొలగిపోయాయని అన్నారు. నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతలతో శనివారం నందినగర్‌లో కేటీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూలు స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వందకు వందశాతం గెలవబోతున్నారని ధీమా వ్యక్తంచేశారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని, దాని పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని చెప్పారు. ఇటీవల కొడంగల్‌లో జరిగిన ఒక సమావేశంలో ముఖ్యమంత్రిలో ఓటమి భయం స్పష్టంగా కనిపించిందని తెలిపారు. తనకు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని సీఎం అసహనంతో మాట్లాడుతున్నారని అన్నారు. పరిపాలన చేతకాకపోవడం వల్లే ప్రజల దృష్టి మరల్చేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సరిగ్గా అమలుచేయని ఈ అసమర్థ ప్రభుత్వానికి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. గత పదేండ్ల కాలంలో తెలంగాణకు ఏమీ చేయని బీజేపీకి ఈ రాష్ట్రంలో అసలు స్థానమే లేదని అన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్

- బీజేపీకి మేలుచేసేలా కాంగ్రెస్ బలహీన అభ్యర్థులు బరిలో
- సర్పంచ్‌గా చేసిన వ్యక్తికి మెదక్ పార్లమెంట్ టికెట్
- కరీంనగర్‌లో ఇప్పటివరకు ఎంపీ అభ్యర్థిని ప్రకటించలేదు
- ఉద్యోగాల భర్తీపై బీజేపీ శ్వేతపత్రం విడుదల చేయాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ)/దుబ్బాక : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ అయ్యాయని, బీజేపీకి మేలు జరిగేలా కాంగ్రెస్ బలహీన అభ్యర్థులను బరిలో నిలిపిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన, దుబ్బాక నియోజకవర్గం దౌల్తాబాద్‌లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. పటాన్‌చెరులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీ ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు మెదక్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ టికెట్‌ను సర్పంచ్‌గా పని చేసిన వ్యక్తికి ఇచ్చిందని అన్నారు. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్లలో వీక్ క్యాండెట్లను కాంగ్రెస్ బరిలో నిలిపిందని విమర్శించారు. కరీంనగర్‌లో ఇప్పటి వరకు అభ్యర్థిని ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్ అయినా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సెక్యులర్ పార్టీ బీఆర్ఎస్ ఎప్పటికీ బీజేపీతో కలిసి పనిచేయదని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ పాలనలో పేదరికం, ధరలు, నిరుద్యోగం పెరిగాయి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగులు భర్తీ చేస్తామన్న బీజేపీ పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉన్నా, 6.50 లక్షల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసి యువతను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ రాముడు పేరు చెప్పి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసినన్ని యజ్ఞాలు, హోమాలు దేశంలో ఏ నాయకుడు చేయలేదని అన్నారు. యాదాద్రి దేవాలయ నిర్మించిన ఘనత మన కేసీఆర్‌ది కాదా అని ప్రశ్నించారు. యువత బీజేపీ మత రాజకీయాలకు మోసపోకుండా తెలంగాణ కోసం అండగా నిలిచే బీఆర్ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని హరీశ్‌రావు కోరారు.

బహిరంగ చర్చకు సిద్ధమా ?

రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవటంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని, రైతు హామీలపై బహిరంగ చర్చకు రేవంత్‌రెడ్డి సిద్ధమా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతుబంధు, కౌలురైతులకు రూ.15వేలు, రైతు కూలీలకు రూ.12వేలు ఇవ్వలేదని మండిపడ్డారు. వరి ధాన్యం, మక్కలకు రూ.500 బోనస్ ఇవ్వటం లేదని, రూ.4వేల పింఛన్, నిరుద్యోగభృతి, మహాలక్ష్మి పథకం అమలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతి ఏడాది రూ.20 కోట్లు పేద పిల్లల విద్య కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. సమావేశాల్లో సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, దేశ్‌పాండే, నరహరిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, మనోహర్‌రావు, కత్తి కార్తీక, యువ నాయకులు చింతా సాయి, శేఖర్‌గౌడ్, సురేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక దుమ్మురేపుడే.. దమ్ము చూపుడే!

- చేవెళ్ల సభతో తడాఖా చూపిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కాంగ్రెస్, బీజేపీలకు అల్టిమేటం
- అసలు సినిమా ముందుందని సంకేతమిచ్చిన గులాబీ బాస్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): 'బీఆర్ఎస్ పని అయిపోంది.. అది ఇగ లేసుడు కష్టం' అని సోషల్ మీడియా వేదికగా కొనసాగుతున్న ప్రచారాన్ని, ఆడుతున్న మైండ్ గేమ్‌ను, జరుగుతున్న దుష్ప్రచారాన్ని చేవెళ్లసభ ద్వారా కేసీఆర్ తునాతునకలు చేశారు. బీఆర్ఎస్ పని అయిపోలేదని, సినిమా ముందుందనే స్పష్టమైన సంకేతం ఇచ్చారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తాము ప్రజల గొంతుకగా నిలబడతామని నిరూపించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో బహిరంగ సభ ద్వారా గులాబీ దళపతి శనివారం ఎన్నికల శంఖారావం పూరించారు. కాంగ్రెస్, బీజేపీకి అల్టిమేటం జారీచేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేసిన మార్పు ప్రచార మాయావలలో చిక్కి తామేం కోల్పోయామో ప్రజలు ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నారని, కొత్తవి ఇయ్యకపోయినా, ఉన్నవి ఊడగొడ్తిరి అనే ధర్మాగ్రహం ప్రజల్లో పెల్లుబుకుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నాలుగున్నర నెలలకే

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ నాలుగున్నర నెలల కాలంలో వచ్చిన 'మార్పు' పెనుముప్పుగా పరిణమిస్తున్న ఉదంతాలు అనేకం చోటుచేసుకున్నాయని, చేవెళ్ల బహిరంగ సభలో పాల్గొన్న జనాభిప్రాయం కూడా అదేనని చెప్పకనే చెప్పింది. ఒక్క చేవెళ్లలోనే కాదు, యావత్ రాష్ట్ర ప్రజల అభిప్రాయం అదేనని చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనే మోసం జరిగిందని, ఈసారి అలా జరగకూడదన్న నిశ్చితాభిప్రాయంతో ప్రజలు ఉన్నారని స్పష్టమైనది. చేవెళ్లలో భూముల ధరలు పడిపోవడం, రియల్ ఎస్టేట్ మందగించడం, అభివృద్ధి ఆగిపోవడం, పరిశ్రమలు రాకపోవడం వంటి అంశాలు తమ ఆదాయ మార్గాలపై ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అసమర్థతపై సమరశంఖం

కరువు పరిస్థితులను అంచనా వేయలేని కాంగ్రెస్ అసమర్థతపై కేసీఆర్ సమరశంఖం పూరించారని, పార్లమెంట్ ఎన్నికల కోడ్‌పేరుతో ప్రభుత్వం తప్పించుకునే ఎత్తుగడపై కేసీఆర్ కత్తి దూశారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు రోజుకోచోట ఇష్టారీతిగా మాట్లాడి దొరికిపోతున్నారని, రైతుబంధు అడిగితే చెప్పుతో కొడ్తా అనడం, ఆడుకోమంటే అంతుచూస్తామని బెదిరించడం, ఉపాధి కల్పించాలన్న చేనేత కార్మికులను నిరోధ్‌లు అమ్ముకోవాలని అవమానించడం వంటి ఘటనలను ఉదాహరణలుగా చూపిస్తున్నారు. ప్రజలిచ్చిన అధికారాన్ని వారి మేలు కోసం కాకుండా ప్రతీకార రాజకీయాలకు వాడుకుంటున్నారన్న అసంతృప్తి ప్రజల్లో వ్యక్తమవుతున్నది.

మైండ్‌గేమ్‌కు మైండ్‌బ్లాంక్

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలా సుద్దులు చెప్పినట్టు ఉండదని, ముక్కుమీద గుద్దినట్టే ఉంటుందని కేసీఆర్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారని, అలా ఇవ్వడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ తన పూర్వపు ఉద్యమ రూపాన్ని పునరావిష్కరణ చేసుకున్నదని తెలంగాణ సమాజం అభిప్రాయపడుతున్నది. అందులో చేవెళ్ల సభ తొలి అడుగు మాత్రమేనని అంటున్నది. ప్రభుత్వ దుష్ప్రచారానికి చేవెళ్ల సభ ద్వారా కేసీఆర్ చెక్‌పెట్టారని, సినిమా ముందుందన్న విషయాన్ని స్పష్టంగా చెప్పారు. అధికారం ఉన్నా, లేకున్నా తెలంగాణ ప్రయోజనాలే తనకు ముఖ్యమని చేవెళ్ల వేదికగా కేసీఆర్ విస్పష్టంగా చెప్పారు. నిజానికి చేవెళ్ల సభకు జనంరారని కాంగ్రెస్ కలలుగన్నది. నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థానిక నాయకులను కాంగ్రెస్ చేర్చుకోవడానికి ప్రయత్నించింది. మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఇతరత్రా నాయకులు వెళ్లినా కార్యకర్తలు తన వెంటే ఉన్నారని చేవెళ్ల సభ నిరూపించింది. తెలంగాణ ప్రజాబలం ముందు, ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ ముందు ఎంతమందిపోయినా బీఆర్ఎస్ పార్టీకి ఏమీ కాదని తేలిపోయింది.

కాంగ్రెస్, బీజేపీ గుండెల్లో రైళ్లు

హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు ఇంత ఆదరణ ఉంటే, ఇక కరువు కోరల్లో చిక్కి అల్లల్లాడుతున్న గ్రామీణ పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చని పరిశీలకులు చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌పైనా, ఆయన కుటుంబంపైనా వ్యక్తిగత విమర్శలు చేసి ఓట్లు, సీట్లు సంపాదించారు కానీ, ఇంకా అవే మాటలు చెప్తే వినేందుకు జనం సిద్ధంగా లేరు. కాలు తొక్కిన నాడే కాపురం చేసే కళ తెలిసిపోతుంది అన్నట్టు కాంగ్రెస్ నాలుగున్నర నెలల పాలనను ప్రజలు చూశారు. కేంద్రంలో పదేండ్ల బీజేపీ పాలనను అనుభవించారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనకు, ప్రస్తుతం నడుస్తున్న కాలానికి పోలికపెట్టి చూస్తే కండ్ల ముందు కనిపించే వాస్తవాలను కనికట్టు చేయలేమని చెప్తున్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయన్న నిజాన్ని చెప్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ పాలనపై తిరగబడుతున్న తెలంగాణ

420 హామీలపై ప్రజల్లోకి వెళ్దాం

- కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై బీఆర్ఎస్‌పై దాడి
- ఉమ్మడి నల్లగొండలో రెండు చోట్ల బీఆర్ఎస్‌దే విజయం
- నకిరేకల్, ఆలేరు బీఆర్ఎస్ సమావేశాల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి/యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ దుర్మార్గ పాలనతో 100 రోజుల్లోనే తెలంగాణ ప్రజలు తిరగబడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. మార్పు తెస్తామంటే నమ్మి ప్రజలు అధికారం అప్పగిస్తే పాలన చేతగాక కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రోజుకో డ్రామాతో సినిమా డైలాగులను తలపిస్తూ సాగుతున్న రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు ఈసడించుకుంటున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని, ప్రజలంతా దీన్ని గమనించాలని పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని నకిరేకల్, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు కాంగ్రెస్, బీజేపీ లోపాయికారిగా ఒక్కటై పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఒకరి గెలుపు కోసం మరొకరు డమ్మీ అభ్యర్థులను పెట్టుకుని డ్రామాలు ఆడుతున్నట్టు మండిపడ్డారు. కాంగ్రెస్ చెప్పిన 420 హామీలను అమలు చేయలేక రేవంత్‌రెడ్డి నోటికి పనిచేప్తూ ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన 15 వేల రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500 బోనస్, తులం బంగారంతో కల్యాణలక్ష్మి, మహిళలకు రూ.2,500, విద్యార్థులకు రూ.ఐదు లక్షల కార్డు, విద్యార్థినులకు స్కూటీల హామీలు ఎటుపోయాయని ప్రశ్నించారు. ఇక కాంగ్రెస్ సృష్టించిన కృత్రిమ కరువు, సాగునీళ్లు, నిరంతర కరెంటు, తాగునీళ్లు ఇవ్వలేక, ధాన్యాన్ని కొనలేని, గిట్టుబాటు ధర చెల్లించలేని అసమర్థతను కప్పుపుచ్చుకోవడానికి సీఎం, మంత్రులు నానా తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలకులు ఎన్ని డ్రామాలకు తె